సాక్షి
హైదరాబాద్, సోమవారం, 21, అక్టోబర్, 2024



అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్: ఒప్పందం ప్రకారం తమకు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు కోట్లాది రూపాయలు తీసుకున్న తర్వాత కూడా ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అనన్య ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజ్‌కుమార్ రాయ్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లో ఉన్న హెచ్ఎస్ఆర్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దూరెడ్డి ధీరజ్ 2018లో అబ్దుల్లాపూర్‌మెట్‌లో 34 ఎకరాల 25 గుంటల స్థలాన్ని అనన్య ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి కొనుగోలు చేశాడు. ఇందుకు గాను రూ.8.37 కోట్లు అనన్య ప్రాజెక్ట్స్ ఎండీ రాజ్‌కుమార్‌రాయ్‌కు చెల్లించాడు. అయితే ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకపోగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని, అసాంఘిక పద్ధతుల్లో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధీరజ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. రాజ్‌కుమార్‌రాయ్ అక్రమాలకు, చట్టవిరుద్ధమైన కార్యక్రమాలతో పాల్పడడమే కాకుండా ఈ విషయాన్ని దాటవేస్తూ వస్తున్నాడని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్ రాయ్‌పై ఐపీసీ 406, 420, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రక్తదానానికి యువత ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఇంటర్నేషనల్ హ్యూమెన్ రైట్స్ ఆర్గనైజేషన్ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. సికిల్ సెల్ సొసైటీ, గోల్కొండ జ్యూరిచ్ స్కూల్ వారు సంయుక్తంగా తలసీమియా వ్యాధి గ్రస్తుల కోసం ఆదివారం గోల్కొండలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. తలసీమియా బాధితులకు రక్తం ఎంతో అవసరమని అటువంటి వారి కోసం రక్తం దానం చేయడం ప్రాణం పోయడంతో సమానమన్నారు. రక్తదాన శిబిరం కన్వీనర్ డాక్టర్ మహ్మద్ మాట్లాడుతూ..170 మంది రక్తదానం చేశారని వీరందరికి సికిల్ సెల్ సొసైటీ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సన్మానం


మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్

గౌలిపురా: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఆదివారం వెంకటేశ్ హిమాయత్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణులు సంతోషంగా ఉన్నారన్నారు. సురేందర్ రెడ్డి, సురేందర్, అంబరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు


బీజేపీ సభ్యత్వ నమోదులో విజయ్‌యాదవ్ తదితరులు

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ సంక్షేమంతోనే బీజేపీకి ఆదరణ లభిస్తుందని గోల్కొండ జిల్లా బీజేపీ జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి విజయ్‌యాదవ్ పేర్కొన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వం కొనసాగుతుందన్నారు. వ్యాపారులతో పాటు స్థానికులంతా బీజేపీ సభ్యత్వం తీసుకొని మోదీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారన్నారు. బేగంబజార్ పరిసరాల్లో ఆయన బీజేపీ సభ్యత్వం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ..బీజేపీతోనే వ్యాపారుల సంక్షేమం, అభ్యున్నతి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగేష్ ముదిరాజ్, రాయ్ ప్రదీప్ జైస్వాల్, గిరీష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



గోల్కొండ: దాతలు, తోటి ఉద్యోగుల సహకారంతో మూడేళ్లుగా నిత్యా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గోల్కొండ సెకండ్ ల్యాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ, మెహిదీపట్నం, నాంపల్లి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారంతా నిరుపేదలే అని అన్నారు. వారికి ఒక పూట భోజనం అందించడానికి మూడేళ్ల క్రితం తాను ఈ అన్నదాన కార్యక్రమం ప్రారంభించానన్నారు.


















గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోటకు పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పర్యాటకులు కోట సందర్శనకు బారులుతీరారు. మధ్యాహ్నం వరకు కోటలో ఎక్కడ చూసినా పర్యాటకులే కానవచ్చారు. కోటలోని క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగి వద్ద ఫొటో దిగడానికి పర్యాటకులు ఒకరితో ఒకరు పోటీపడ్డారు. కాగా భారీ సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో గోల్కొండ కోట ఎదురుగా గల షాపులు, రెస్టారెంట్లు కొనుగోళ్లతో కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు



డబీర్‌పురా: డబీర్‌పురా బోధేఅలీషా కిడికి ప్రాంతంలో ఆదివారం గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నషాన్ (జెండా) ఎగరవేసి అనంతరం స్థానికంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ జిలానీ, మహమూద్ షఫీ, ఖయ్యూం, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.






ఐటీఐ ప్రవేశాలకు 30 వరకు గడువు పొడిగింపు

విజయనగర్‌కాలనీ: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ల్లో వివిధ కోర్సులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్వీకే నగేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ట్రేడ్లలో చేరేందుకు 8, 10వ తరగతుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. గడువును ఈ నెల 30 వరకు పొడిగించామన్నారు. మరిన్ని వివరాలను మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో లేదా వెబ్‌సైట్ https://iti.telangana.gov.in లో పొందవచ్చు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

గోల్కొండ: నేడు గుడిమల్కాపూర్‌లోని కూరగాయల మార్కెట్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ తెలిపారు. కార్వాన్, గోషామహల్, నాంపల్లి తదితర నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు తాము నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు భారీగా స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.







వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజేంద్రనగర్: కాలనీలు, బస్తీల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని పలువురు కోరారు. రాజేంద్రనగర్ హసన్‌నగర్‌లోని నూరానీ జమా మసీదు ప్రాంతంలో ఆదివారం అబాబీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మౌలానా హఫీజ్ సయ్యద్ షా తౌఫిక్ ఉల్లా హుస్సేన్ బఖారీ, డాక్టర్ మహ్మద్ ముజతబా హుస్సేన్‌లు పాల్గొని వైద్య సేవలు అందించారు.


















ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్, టోలిచౌకీ, ఎస్ఎస్ఎఫ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో క్రమం తప్పకుండా తాను అన్ని డివిజన్లలో పర్యటిస్తున్నానన్నారు. సమస్యలు స్వయంగా ప్రజల నుంచి తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, జాకేర్, నజీబ్ తదితరులున్నారు.

ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకుడు ఉమామహేంద్ర తదితరులు

చార్మినార్: శాంతియుతంగా నిరసన తెలియజేసిన వారిపై పోలీసుల లాఠీచార్జ్‌ను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పురానాపూల్ వద్ద ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. బీజేపీ గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేంద్ర ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పురానాపూల్ దర్వాజ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ..సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాల్సిన విషయాన్ని పక్కన పెట్టి..లాఠీచార్జ్ చేయడం దారుణమన్నారు.

నేడు మధ్యాహ్నం గంట పాటు వ్యాపార సంస్థలను బంద్ చేయాలి..

ఆలయంపై జరిగిన దాడితో పాటు పోలీసుల లాఠీచార్జ్‌ను నిరసిస్తూ చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హిందూ వ్యాపారస్తులు సోమవారం స్వచ్ఛందంగా తమ వ్యాపారాలను బంద్ చేసి నిరసన తెలియజేయాలని ఉమ మహేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు తమ వ్యాపార సంస్థలను మూసి వేసి నిరసన తెలియజేయాలని ఆయన కోరారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు సురేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్

సంతోష్‌నగర్: బీజేపీ మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. యాకుత్‌పురా జోన్ రెండో మహాసభను సంతోష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో అబ్బాస్ మాట్లాడుతూ.. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. తెలంగాణలో పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకోకపోవడంతో గుణపాఠం చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారి కట్టబెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోతుందన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శిగా ఎం.బాలు నాయక్, జోన్ కమిటీ సభ్యులుగా శ్రావణ్ కుమార్, జె.అరుణ్, అన్వర్ ఖాన్, ఎస్.స్వరూప, జి.యాదమ్మ, పి.దేవయ్య, ఎస్.యాదయ్య, అలీ అబ్బాస్, ఎం.బాలకృష్ణతో కొత్త కమిటీ ఎన్నికయ్యారు.

‘ఆలయాలపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి’

చార్మినార్: ఆలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత భక్తులతో పాటు ప్రభుత్వానిదని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అమ్మవారి విగ్రహాలను కూల్చడం పరిపాటిగా మారిందన్నారు.

గవర్నర్‌కు ఆహ్వానం



చార్మినార్: రానున్న దీపావళి వేడుకలను పురస్కరించుకుని భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకోవాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను కోరినట్లు ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయనను కలిసి దీపావళి పండుగ ఆహ్వానాన్ని అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.

గుర్తుతెలియని యాచకురాలి మృతదేహం లభ్యం



గౌలిపురా: గుర్తుతెలియని యాచకురాలి మృతదేహం లభ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..గౌలిపురా మహ్మద్ షకూర్ మసీదు ప్రాంతంలో ఈనెల 19న రాత్రి 11 గంటల సమయంలో గుర్తుతెలియని 68 ఏళ్ల మహిళా యాచకురాలి మృతదేహం పడి ఉంది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మొఘల్‌పురా పోలీసులు గమనించి స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు యాచకురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.































